క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


ఊయలసేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం సాయంత్రం ఊయల సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

అంకాలమ్మకు బోనం సమర్పణ


అంకాలమ్మకు బోనం సమర్పించేందుకు వెళ్తున్న ఆలయ అధికారులు, ప్రధానార్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా లోకకల్యాణం కోసం దేవస్థానం తరుపున బోనం సమర్పించారు. ఉదయం ఆలయ మహాద్వారం నుంచి స్వామివారి ప్రధానార్చకుడు హెచ్.వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు ఎం.ఉమానాగేశ్వరశాస్త్రి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు, పలువురు అర్చకస్వాములు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు, పసుపుకుంకుమ, గాజులు, ఫలపుష్పాలతో అంకాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ముందుగా లోకక్షేమం కోసం సంకల్పం పఠించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి బోనం సమర్పించారు.

మైనార్టీ అసోసియేషన్ నూతన కార్యవర్గం


అధ్యక్ష, కార్యదర్శులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల ముస్లిం మైనార్టీ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు ఎస్.జిలానీబాషా తెలిపారు. నూరానీ మసీదులో హఫీజ్ నూర్‌మహ్మద్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఆసార్ సయ్యద్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నజీర్, కోశాధికారిగా జూటూరు అన్వర్‌బాషా, ఉపాధ్యక్షులుగా జూటూరు అబ్దుల్‌ఖాదర్, జమీల్‌బాషా, సయ్యద్ సుభాని, షేక్ ముర్తుజావలి, సహాయ కార్యదర్శులుగా ఆలీ హఫీజ్, సయ్యద్ వకీల్, షేక్షావలి, సలహాదారులుగా కె.నూర్‌మహమ్మద్ హఫీజ్, ఎండి ఖాసీం మౌల్వీ, ఎం.ఖాజా హుస్సేన్ మౌల్వీ, ఆలిం ఆరిఫ్ మూలానాలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

నేడు సర్వసభ్య సమావేశం

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సరస్వతి శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

లింగ వివక్షను రూపుమాపాలి

పాములపాడు: పిల్లలపై తల్లిదండ్రులు లింగ వివక్ష లేకుండా సమానంగా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి సూచించారు. శుక్రవారం రుద్రవరం గ్రామంలో బాల సభ కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. గర్భిణులకు అంగన్‌వాడీ సెంటర్లలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. బాల్య వివాహాలు చేయరాదని చెప్పారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను వివరించారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

వెలుగోడు: రాష్ట్ర ప్రభుత్వం కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వైద్యాధికారులు జహీర్ వలి, ప్రణీత్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా కుష్టు నివారణపై వేల్పనూరు 1వ సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. స్పర్శలేని, రాగి రంగు మచ్చలు, పాలిపోయిన మచ్చలు, దురదలేని మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

రేపు మహానందిలో శాకంబరీ ఉత్సవం

మహానంది: ఆషాడమాసం, శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మహానందిలోని కామేశ్వరిదేవి అమ్మవారికి ఆదివారం శాకంబరీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వేదపండితుడు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి నంద్యాలకు చెందిన కూరగాయల వ్యాపారి లక్కనబోయిన ప్రసాద్ కూరగాయలు వితరణ చేయనున్నారని చెప్పారు. శాకంబరీ స్వరూపంలో ఉండే అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని తెలిపారు.

కుండపోత వర్షం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన వర్షం 44.6 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో పాములపాడు మండలంలో అత్యధికంగా 62.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మిడ్తూరు మండలంలో అత్యల్పంగా 3.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. జూపాడుబంగ్లాలో 44.6 ఎం.ఎం, పగిడ్యాలలో 37.0 ఎం.ఎం, నందికొట్కూరులో 21.4 ఎం.ఎం, కొత్తపల్లిలో 20.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఎక్కడ పంటలు దెబ్బతింటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొత్తపల్లి: అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా మండలంలో జోరుగా వానలు కురుస్తున్నాయి. అన్ని గ్రామాలలో గురువారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. మండలంలోని ఎర్రమఠం, గుమ్మడాపురం, ముసలిమడుగు, శివపురం, కొక్కెరంచ, గోకవరం, దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 20.03 మి.మీల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో పంటపొలాల్లో నీరు నిలిచింది. జోరువానకు మొక్కజొన్న, పెసర, మినుము, పత్తి, సోయాబీన్స్ పంటలు ఎక్కడ దెబ్బతింటాయోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

62.2 మి.మీ వర్షపాతం నమోదు

పాములపాడు: మండలంలో గురువారం రాత్రి నుంచి 62.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది శుక్రవారం తెలిపారు. ఈ వర్షం వల్ల వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వ్యవసాయ బావులు నీటితో నిండి భూమికి సమాంతరంగా వచ్చాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచింది.

మహానందిలో జడివాన

మహానంది: మండలంలో శుక్రవారం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. నిమిషమైనా గ్యాప్ లేకుండా ఏకధాటిగా కురిసిన వర్షంతో పలు గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు చేరినట్లు ప్రజలు వాపోయారు. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, అబ్బీపురం, గాజులపల్లె తదితర గ్రామాల్లో లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. వర్షం కారణంగా మహానంది ఆలయంలో పల్లకీసేవను రద్దు చేసినట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.


బండినాయిని పాలెంలో నీటమునిగిన వరిపొలాలు


మహానందిలో కురుస్తున్న వర్షం


మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షపు నీరు


కొత్తపల్లి సమీపంలో మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షపు నీరు


చెలిమిల్ల సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న సుద్దవాగు


అబ్బీపురం చెంచుకాలనీలో వర్షపునీటిలో స్థానికులు

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం


ఆరోగ్య కేంద్రం వద్ద పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

మహానంది: బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఉన్న అపరిశుభ్రత, పారిశుద్ధ్య లోపంపై గురువారం పర్యటనకు వచ్చిన నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె హెచ్చరికలతో బండిఆత్మకూరు మండల అధికారులు స్పందించారు. ఎంపీడీఓ విజయరావు, డాక్టర్ భావనరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కలెక్టర్ పర్యటనతో మార్పు వచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేతన బకాయిలను చెల్లించండి

ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు రెండు నెలల నుంచి వేతనాలు అందలేదని, వెంటనే చెల్లించాలని ప్రభుత్వ కాలేజీల ఆర్‌జేడీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అబ్దుల్‌జబ్బార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మే, జూన్ వేతనాలు ఇంతవరకు అందలేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలను చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్


తాటిపాడు సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సోషల్‌ఆడిట్ స్టేట్ టీం లీడర్ లోకేశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: ఉపాధిహామీ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజలు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సోషల్‌ఆడిట్ స్టేట్ టీం లీడర్ లోకేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, జూపాడుబంగ్లా గ్రామాల్లో సోషల్‌ఆడిట్ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపాడులో నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామసభలో ఆడిట్ బృందం సభ్యుల విచారణలో వెల్లడైన విషయాలను గ్రామస్తులకు చదివి వినిపించారు.. గ్రామంలోని కేసీ కాల్వ కట్ట వెంట 400 మొక్కలు నాటగా కేవలం 25 మాత్రమే బతికాయని సుమారు రూ.16 వేల నష్టం వాటిల్లిందన్నారు. మారుతమ్మ అనే మహిళ 6 రోజులు పనికివచ్చినట్లు కనబరచి రూ.1,170 ఆమె బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. మస్టర్‌రోల్స్‌లో దిద్దుబాటు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అలాగే మస్టర్‌రోల్స్‌లో సంతకాల్లేకుండా తెలుగు మాధవి 6 రోజులు పనికి వచ్చినట్లు కనపరచి రూ.1,479, బోయదేవన్న పేరున రూ.1,120, యశోదమ్మ, తిరుపతినాగన్న, షేక్ షమీన్, ప్రమీలమ్మ పేరిట సంతకాల్లేకున్నా మస్టర్‌రోల్స్‌లో హాజరు వేసి ఒక్కొక్కరికి రూ.1,120 బిల్లులు ఖాతాలో జమ చేసినట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా కొందరు గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో సక్రమంగా ఉపాధి పనులు కల్పించడం లేదని, పనులు కల్పించాలని కోరితే దుర్భాషలాడుతున్నారని స్టేట్ టీం లీడర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అందజేస్తే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సర్పంచ్ వంగల లక్ష్మిదేవి, ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌బాషా, మురాత్, అల్లావుద్దీన్, శాంతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసభను బహిష్కరించిన సర్పంచ్, ఎంపీటీసీ: జూపాడుబంగ్లా గ్రామ సచివాలయం-2లో శుక్రవా రం నిర్వహించిన సోషల్‌ఆడిట్ గ్రామ సభను సర్పంచ్ మొట్టె బాలయ్య, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ బహిష్కరించి సభలోంచి వెళ్లిపోయారు. ఉపాధి హామీ పనుల్లో ప్రభుత్వ పింఛన్ పొందుతున్న వారు, గ్రామంలో లేనివారు, పనికి వెళ్లని వారి పేరిట మస్టర్లు వేసి వారి అకౌంట్లో డబ్బులు జమచేసి ఫీల్డ్ అసిస్టెంటు సొమ్ము చేసుకోవడం జరిగిందని ఎలాంటి ఆధారాల్లేకుండా ఓ ఫిర్యాదు పత్రాన్ని సోషల్ ఆడిట్ బృందానికి ఇచ్చి సభలోంచి వెళ్లిపోయారు.

నేడు సోషల్‌ఆడిట్ సభ

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద 18వ విడత సోషల్ ఆడిట్ బహిరంగ చర్చావేదిక సభను శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ గౌరీబాయి తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో రూ.7,81,01,665 నిధులు వెచ్చించి 777 పనులు చేసినట్లు తెలిపారు. ఈ పనుల్లో అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం, నాణ్యతను సోషల్‌ఆడిట్ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను జిల్లా అధికారుల సమక్షంలో వెల్లడించనున్నట్లు తెలిపారు. జిల్లా పీడీ, ఏపీడీ, క్వాలిటీ, విజిలెన్స్ అధికారులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు, ఉపాధి సిబ్బంది, వివిధశాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించండి


కడుమూరు పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న వైద్యాధికారి జగదీష్ చంద్రారెడ్డి

మిడుతూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నంద్యాల జిల్లా ఫ్యామిలీ డాక్టర్ పథకం నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని దేవనూరు మజారా గ్రామమైన సున్నంపల్లిలో 104 సేవలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 104 సంచార వాహనం ద్వారా ఏయే వైద్యసేవలు అందుతున్నాయో ఆరా తీశారు. బీసీజీ వ్యాక్సిన్‌ను ఆరు రకాల వర్గాల ప్రజలకు వేయాలని సూచించారు. అలాగే మిగిలిఉన్న బీసీజీ వ్యాక్సిన్‌లను ప్రజలు వేయించుకొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనపై ఇంటింటి సర్వే చేశారా అని ఆరాతీశారు. వారికి సకాలంలో మందులు అందుతున్నాయా అని వ్యాధిగ్రస్తులను అడిగి తెలుసుకున్నారు. కుష్టువ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. గ్రామాలలో నీటి నమూనాలను బోరుబావుల వద్ద పరిశీలించాలన్నారు. అతిసార వ్యాధి ప్రబలకుండా నీటికి క్లోరినేషన్ చేయడం, వాటర్ ట్యాంకులు శుభ్రపరచడం, తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యసేవలతో పాటు, డెలివరీ కేసుల వివరాలను తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ భరత్, హెల్త్ సూపర్‌వైజర్ ఏసేపు, పీహెచ్‌ఎన్ గురుదేవి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరికి బోనాలు


బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మహానంది: మహానందిలోని ఈశ్వర్‌నగర్‌లో కొలువైన సుంకులా పరమేశ్వరిదేవికి దేవస్థానం, ఈశ్వర్‌నగర్ కాలనీలకు చెందిన మహిళలు శుక్రవారం బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన బొడ్డు రాయిల వద్ద పూజల అనంతరం కాలినడకన బోనాలు తీసుకెళ్లి సుంకులమ్మ ఆలయంలో సమర్పించారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


ఎర్రమఠం గూడెంలో గిరిజనులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎర్రమఠం వైద్యాధికారి జబ్బీర్ సూచించారు. మండల పరిధిలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎర్రమఠం, ముసలిమడుగు చెంచుగూడెంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించడం, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయించాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అలాగే చెంచుగూడెలలో గిరిజనులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సారా, చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా వంటివాటికి దూరంగా ఉండాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. వ్యాధుల నివారణకు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలతో పాటు సలహాలు, సూచనలు ఇస్తున్నామన్నారు. జ్వరాలు, ఇతర వ్యాధులు సంక్రమిస్తే సమీప ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్లు సత్యం రెడ్డి, శాంతమ్మ, నిర్మల, జయమణి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ


అమ్మవారికి హారతులిస్తున్న అర్చకుడు

శ్రీశైలంటెంపుల్: మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీలను చేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోవద్దు


విద్యుత్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఈ రామాచారి

నందికొట్కూరు: విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో భద్రత పాటించాలని ఏడీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సాయంత్రం ఏఈలు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లలో అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు, పరికరాలు ఐఎస్ఐ ప్రమాణాలు ఉన్నవాటినే వాడాలన్నారు. స్విచ్ బోర్డులను తగినంత ఎత్తులో అమర్చుకోవాలని సూచించారు. లోడుకు అనుగుణంగా నాణ్యమైన సర్వీస్ వైర్‌ను వాడితే వోల్టేజ్ హెచ్చుతగ్గులను నివారిస్తుందని వివరించారు. వర్షం పడుతునప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైరు (సపోర్టు వైర్లు) ముట్టుకోరాదన్నారు. ఇల్లు, ఇతర నిర్మాణాలు జరుగుతునప్పుడు దగ్గరలో విద్యుత్ లైన్లు, స్తంభాలు ఉంటే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేసి సంస్థ ప్రామాణిక నిబంధనల ప్రకారం తగిన దూరం పాటించి నిర్మాణాలను చేపట్టాలని సూచించారు.విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం తమ సిబ్బందిని మాత్రమే సంప్రందించాలని, ప్రైవేట్ వ్యక్తులను సంప్రందించరాదన్నారు. ఏఈ రాములునాయక్, క్రాంతికుమార్, రామాచారి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలు, స్తంభాలకున్న స్టేవైర్లను ముట్టుకోవద్దని ట్రాన్స్‌కో ఏఈ రామాచారి సూచించారు. శుక్రవారం జూపాడుబంగ్లా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్‌స్తంభాలు ఎర్త్ అవుతున్నా, విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగులుతున్నా వెంటనే పరిష్కరించాలన్నారు. తడిచేతులు, కాళ్లతో ఉన్నప్పుడు కరెంటు స్విచ్‌లను తగలరాదని సూచించారు. విద్యుత్ సంబంధిత పనులు ఉంటే సిబ్బంది, అధికారులకు సమాచారం ఇచ్చి పనులు చేసుకోవాలన్నారు. ఇష్టారాజ్యంగా పనులు చేపడితే విద్యుత్ ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్‌సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మహానంది: సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు హెచ్చరించారు. ఏఓ హనీఫ్‌ఖాన్‌తో కలిసి శుక్రవారం ఏ.కోడూరులోని సచి వాలయం, బండిఆత్మకూరులోని కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి


పెద్దగుమ్మడాపురంలో వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కొత్తపల్లి: రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే మంజూరుచేయాలని ఏపీ రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, రైతు సంఘం నాయకుడు దాసు డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దగుమ్మడాపురం, శివపురం గ్రామ సచివాలయాల్లో రైతు, కౌలురైతు సంఘాల పిలుపు మేరకు పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 50 రోజులైనా ఇప్పటివరకు పంటలసాగుకు పెట్టుబడి సాయం అందించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన హామీ మేరకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంటల బీమా అమలు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, రైతు రుణాలు మాఫీ, వ్యవసాయానికి ఉచిత కరెంట్ అందించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏసన్న, దేవకుమార్, డీవైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, శ్రీను, రైతుసంఘం నాయకులు సోమేష్, చిన్నస్వామి, రమణ, ఏసేపు, ప్రేమ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలని నిరసన

మహానంది: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గాజులపల్లె సచివాలయం-2 వద్ద రైతులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. పంటల సాగుకు పెట్టుబడి లేక రైతులు అప్పులు చేసే పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. రైతు సంఘం నాయకులు ఇమామ్, హుసేన్, రాజా నాయక్, బాల మద్దిలేటి, వి.మద్దిలేటి పాల్గొన్నారు.

పాడి సంరక్షణకు పశువైద్య శిబిరాలు


పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పగిడ్యాల: పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ కే.రాజశేఖర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సంకిరేణిపల్లెలో గ్రామ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పశువుల్లో గర్భకోశ వ్యాధులను నిర్మూలించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల్లో రెండు ఈతలకు మధ్య కాలాన్ని తగ్గించుకోవాలని, దూడల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం జూపాడుబంగ్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజినేయులు నాయక్ మాట్లాడుతూ.. పశుగ్రాస పెంపకాలను చేపట్టాలని, శుభ్రమైన వాతావరణంలో పశువుల షెడ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశుగ్రాస విత్తనాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక వైద్యాధికారి శ్రుతికీర్తి, పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీనులవిందుగా హరికథా గానం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడప జిల్లా మైదుకూరుకు చెందిన వై.నాగరాజు భాగవతార్ శివపార్వతుల కల్యాణంపై హరికథ గానం చేసి భక్తులను అలరించారు. హార్మోనియం వై.జయకృష్ణ, తబల సహకారాన్ని వై.సుధాకర్ అందించారు.